క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



బాధితులకు ఆర్థిక సహాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలూరు రూరల్ : అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన బాధితులను వైఎస్సార్ సీపీ నాయకులు ఆదుకున్నారు. శనివారం ఏలూరు మండలం జాలిపూడిలో మాత్రపు ఉషారాణి, రాజారత్నంకు చెందిన పూరిళ్లు దగ్ధమయ్యింది. ఉదయం కట్టెల పొయ్యి నుంచి చెలరేగిన నిప్పురవ్వలు ఇంటికీ వ్యాపించడంతో మంటలు చెలరేగి పూరిల్లు క్షణాల్లో దగ్ధమైంది. వంట సామాన్లుతో పాటు విలువైన సామగ్రి బూడిదకావడంతో బాధితులు కన్నీరు మున్నీరయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆదేశాల మేరకు ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, జాలిపూడి సొసైటీ చైర్మన్ బొల్లిముంత రామ్మోహనరావు, బాపనయ్యతో పాటు వైసీపీ గ్రామధ్యక్షుడు వాసు, ఎంపీటీసీ కాకర్ల తంబి తదితరులు బాధితులను పరామర్శించారు. రూ 5 వేలు నగదుతో పాటు 50 కేజీల బియ్యం అందజేసారు. ప్రభుత్వం నుంచి మరింత సహాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

7న సీఆర్ఆర్ మహిళా కళాశాల వార్షికోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సీఆర్ఆర్ మహిళా కళాశాల 36వ వార్షికోత్సవం ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్స్‌పాల్ పీ. శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వార్షిక నివేదిక ప్రవేశపెడతామని, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ వార్షికోత్సవాల్లో సీఆర్ఆర్ విద్యా సంస్థల పాలక మండలి అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్, ఉపాధ్యక్షుడు వీవీ బాలకృష్ణారావు, ఏవీ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, తమ కళాశాల కరస్పాండెంట్ చలసాని నానాజీ పాల్గొంటారన్నారు.

ఉచితంగా అంతిమ యాత్ర రథాలు

ఏలూరు టౌన్: ఏలూరు నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. గుప్తా ఫౌండేషన్ సంస్థ ఏలూరు నగర పాలక సంస్థకు రెండు అంతిమయాత్ర రథాలను విరాళంగా అందించారని తెలిపారు. ఏలూరు నగర ప్రజలకు ఉచితంగా అంతిమ రథయాత్రలు అందించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. నగర ప్రజలు ఎవరికైనా అంతిమ రథయాత్రకు వాహనాలు అవసరం అయితే నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకూ అందుబాటులో ఉంటాయని తెలిపారు.

కుక్కలున్నాయ్... పిక్కలు జాగ్రత్త !

- విస్తృతంగా పెరిగిన శునకాల సంతతి
- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- కానరాని కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు



ఏలూరు టౌన్: సాయంత్రమైతే చాలు కుటుంబంతో రోడ్డెక్కుతాయి. కూడళ్లలో సతీసమేతంగా విశ్రాంతి తీసుకుంటాయి. కనిపిస్తే కండ పీకుతాయి. పరుగులు తీయిస్తాయి. పట్టణాల నుంచి పల్లెల వరకు శునకాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. శస్త్ర చికిత్సలతో శునకాల సంతతి తగ్గించాలని ప్రభుత్వం ఆదేశించింది. నగరం, పట్టణం, గ్రామ పంచాయతీల వరకు నిధులు ఉన్నా శునకాల నియంత్రణ కాగితాలకే పరిమితమైంది. రోజుకు కనీసం ఇద్దరు, ముగ్గురు కుక్కల బారిన పడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వాహనాలపై వెళ్లే వారిని సైతం వెంటాడి మరీ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కుక్కల వృద్ధి నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉండడంతో నగరపాలక అధికారులు వాటివైపు చూసేందుకు భయపడుతున్నారు. జంతు ప్రేమికుల వత్తిడులు, చట్టాలతో అధికారులకు సైతం ఏమి చేయాలో పాలుపోవటం లేదంటున్నారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో చిన్నారిని గ్రామసింహాలు దాడి చేసి చంపటం కలకలం రేపింది. ఇక నిత్యం శునకాల దెబ్బకు జనం బెంబేలెత్తిపోతున్నారు.

హడలెత్తిస్తోన్న శునకాలు :

ఏలూరు జిల్లాలో కుక్కల బెడదతో జనం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారుగా 40వేలకు పైగా వీధి కుక్కలు ఉన్నాయి. పెంపుడు కుక్కలు మరో 20వేలకు పైగా ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్క ఏలూరు నగరంలోనే ఐదు వేలకు పైగా వీధి కుక్కలు ఉంటాయని అంటున్నారు. ఇక కొందరు ఇంటికి కాపలాగా వీధి కుక్కలను పెంచుకోవటం పరిపాటిగా మారింది. ఇతర కుక్కలు వీధుల్లో తిరుగుతూ ఇళ్ల నుంచి బయట పారవేసే పదార్థాలను తింటూ జీవిస్తున్నాయి. ఇవన్నీ గుంపులుగా రోడ్లపై తిరుగుతూ... ముఖ్యంగా రాత్రి వేళల్లో అయితే జనం ఒంటరిగా వెళ్లేందుకు భయపడుతున్నారు. మోటారు సైకిళ్లపై, నడిచి వెళ్లే వారిపై ఆకస్మికంగా వెంటాడుతూ కాటు వేస్తున్నాయని జనం అంటున్నారు. ఏలూరు నగరం, నూజివీడు, కైకలూరు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం ఇలా పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లోనూ వీధి కుక్కలతో జనం ఆందోళనకు గురవుతున్నారు. 6నెలల కాలంలో జిల్లాలో 2వేలకు పైగా కుక్కకాటు కేసులు నమోదు అయ్యాయని వైద్యాధికారులు చెబుతున్నారు. కాకపోతే రాబిస్ కేసులు లేకపోవటంతో కొంత ఊరట నిస్తుందని అంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్కకాటు మందులు అందుబాటులోనే ఉన్నాయి. ఏలూరు జిల్లాలో 35వేలకు పైగా కుక్కకాటు టీకా డోస్‌లు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

కొరకరాని కొయ్యిలా ... కుక్కల కట్టడి

గ్రామసింహాలను కట్టడి చేయటం ప్రభుత్వ అధికారులకు కొరకరాని కొయ్యిలా మారిందనే అభిప్రాయం ఉంది. ఒకవైపు జనంపై దాడులు చేస్తూ భయాందోళనలకు గురిచేస్తూ ఉండగా , మరోవైపు చట్టాలు దెబ్బకు కుక్కల వైపు చూసేందుకు అధికారులు జంకుతున్నారు. కుక్కలు ఒకే ఈతలో ఐదుకు పైగా పిల్లలకు జన్మనిస్తాయి. ఒకటి రెండు చనిపోయినా ఒక్క ఏడాదిలోనే కుక్కల సంఖ్య రెట్టింపు అవుతూ ఉంటుంది. జంతు సంరక్షణ చట్టం మేరకు వీధి కుక్కలను చంపటం తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. కుక్కల సంతతిని అరికట్టేందుకు యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ), జంతు సంరక్షణ బోర్డ్ ఆఫ్ ఇండియా ప్రత్యేక నిబంధనలు విధించింది. ఈ నిబంధనల మేరకు శునకాలు సంతోనోత్పత్తి చెందకుండా చికిత్స చేయాల్సి ఉంటుంది. ఆడ కుక్కలకు, మగ కుక్కలకు వేర్వేరు విధానాల్లో ఈ చికిత్స చేస్తారు. జంతు సంరక్షణ బోర్డు ఆఫ్ ఇండియా గుర్తింపు కలిగిన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుక్కలను జాగ్రత్తగా పట్టుకుని తీసుకువెళ్లి ఒక చోట భద్రంగా ఉంచి, సంతానోత్పత్తి కలుగకుండా ఆపరేషన్ చేసి, మంచి ఆహారం అందించి, ఏ ప్రాంతం నుంచి అయితే తీసుకువెళ్లారో అదే చోట వదిలేయాలనేది నిబంధన. ఇక పిచ్చి కుక్కలను సైతం చంపాలంటే జంతు సంరక్షణ కమిటీ విధిగా నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నా... నిబంధనలు పాటించకుంటే తమ ఉద్యోగాలకు ఎక్కడ ఇబ్బంది అవుతుందోననే ఆందోళనతో వారంతా మాకెందుకు అనే రీతిలో నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రథమ చికిత్స ఇలా



కుక్కకాటుకు గురైతే గాయాన్ని సబ్బుతో, నీటితో బాగా కడగాలి. కరచిన గాయాన్ని కప్పకూడదు. వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలి. ర్యాబిస్ వ్యాధితో చనిపోయిన కుక్కను కాల్చకూడదు, పూడ్చివేయాలి. ర్యాబిస్ వ్యాధితో ఉన్న కుక్క తిరిగిన పరిసరాలను, అది ముట్టిన పాత్రలను క్రిమి సంహారక మందులతో శుభ్రపరుచుకోవాలి. పెంపుడు కుక్కలకు ర్యాబిస్ టీకా వేయించాలి. వీధి కుక్కలకు ఈ వ్యాధి సోకకుండా టీకాలు వేయించాల్సి ఉంటుంది. కుక్కలు అధికంగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండటమే మంచిది. పెంపుడు కుక్కలను సైతం అత్యంత జాగ్రత్తగా ఉంచుతూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

– గణేష్, జిల్లా మేనేజర్, 108 అత్యవసర సేవలు

వీధి కుక్కల బెడద పెరిగిపోయింది



ఏలూరు నగరంలో కుక్కల బెడద పెరిగిపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం. బయటకు వెళితే ఎక్కడ దాడి చేస్తాయో అనే భయం వేస్తోంది. వీధుల్లోకి వెళితే కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఏలూరు కార్పొరేషన్ అధికారులు కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి. ప్రజల ప్రాణాల కంటే శునకాలు ఎక్కువ కాదనే విషయాన్ని అధికారులు గుర్తించి కుక్కల సంఖ్య తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి.

– షేక్ పర్వీన్, గృహిణి, ఏలూరు

శునకాలతో ఇబ్బంది పడుతున్నాం



ఏలూరు నగరంలో శునకాలతో ఇబ్బందులు పడుతున్నాం. ఒంటరిగా వెళ్లాలంటే పిల్లలు, మహిళలు భయపడుతున్నారు. హైదరాబాద్ సంఘటనతో చిన్నారులను బయటకు పంపాలంటే ఆందోళనగా ఉంది. జంతు ప్రేమికుల గురించి, చట్టాల గురించి అధికారులు కుక్కల నివారణకు చర్యలు తీసుకోవటం లేదు. ఏదైనా కుక్కను చంపితే తమ ఉద్యోగాలకు ఎక్కడ ఇబ్బంది వస్తుందో అని అధికారులు వెనుకడుగు వేయటంతో కుక్కలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– ఎండీ రెహమాన్, పత్తేబాద, ఏలూరు

విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న బిషప్ పొలిమేర జయరావు తదితరులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని, ఇందుకుగాను ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించడానికి నిరంతరం శ్రమించాలని ఏలూరు కథోలిక పీఠం పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు పిలుపునిచ్చారు. స్థానిక అశోక్ నగర్‌లోని అమలోద్భవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 34వ వార్షికోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఒక వ్యక్తి అభివృద్ధి దాని ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పొరుగువారిని ప్రేమిస్తూ అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. అమలోద్భవి పాఠశాల గత 34 ఏళ్లుగా విద్యారంగంలో విశేష సేవ చేస్తూ ఎంతోమంది అధికారులను, పారిశ్రామికవేత్తలను సమాజానికి అందించడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందచేశారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఫాదర్ జీ. మోజెస్, ఆర్‌సీఎం స్కూల్స్ డీజీఎం ఫాదర్ అమ్మన్ రాజా, ఏలూరు డయోసీస్ ఛాన్సలర్ ఫాథర్ బాబు జార్జ్, పారిష్ ప్రీస్ట్ డాక్టర్ ఇంజేపాల్, 32వ డివిజన్ వైసీపీ నాయకుడు బండారు కిరణ్ కుమార్, స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ జ్యోతి, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ రోస్మీ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో స్కానింగ్ కేంద్రాల తనిఖీ



స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఆశ

ఏలూరు టౌన్ : లింగ నిర్ధారణ పరీక్షలు చేసే ల్యాబరేటరీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని ఏలూరు నగరంలోని యూపీహెచ్‌సీ ఎస్‌ఆర్‌పేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమర్ హెచ్చరించారు. ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆశ ఆదేశాల మేరకు జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భేటీ బచావో... భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఏలూరులో అనధికార స్కానింగ్ కేంద్రాలు, డయాగ్నోస్టిక్ సెంటర్లను గుర్తించేందుకు ఏలూరు ఆర్ఆర్‌పేటలో వీనస్ స్కానింగ్ సెంటర్, సుస్మిత డయాగ్నోస్టిక్ సెంటర్లలో రికార్డులు, లింగ నిర్ధారణ చేశారా అనే కోణంలో రిపోర్టులను వైద్య అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ, భ్రూణ హత్యల నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎవరైనా మొదటిసారి పట్టుబడితే మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తామని చెప్పారు. రెండో సారి పట్టుబడితే ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తామని, ఇక మూడోసారి కూడా పట్టుబడితే ఐదేళ్ల జైలు, రూ.50 వేలు జరిమానాతోపాటు డాక్టర్ సర్టిఫికెట్‌ను శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు. చట్టానికి వ్యతిరేకంగా స్కానింగ్ కేంద్రాలు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, ల్యాబ్స్, ప్రైవేట్ హాస్పిటల్స్ ఏదైనా కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో డాక్టర్ రోహిత, డాక్టర్ దివ్య, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎటువంటి తేడా కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి వ్యాధి తొలి దశలోనే గుర్తించడం ద్వారా తగిన చికిత్స తీసుకుని ప్రాణాలు కాపాడుకోవాలని విజయవాడ ఎంజే నాయుడు హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత శర్మ సూచించారు. శనివారం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏలూరు మెయిన్ బ్రాంచ్‌లో ఎంజే నాయుడు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వేగం పెరిగిన ఆధునిక జీవన శైలిలో మానసిక ఒత్తిళ్ళకు లోనవుతున్న కారణంగా ఎక్కువ మంది ప్రజలు రక్తపోటు, మధుమేహ వ్యాధులకు గురౌతున్నారన్నారు. అలాగే ఆహారపు అలవాట్ల కారణంగా ఎముకలు, కీళ్ల వ్యాధులకు కూడా గురౌతున్నారన్నారు. శరీరంలో ఎటువంటి సమస్య ఎదురైనా ముందుగానే వైద్యులను సంప్రదించి చికిత్స ప్రారంభిస్తే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుని శస్త్రచికిత్సలు అవసరమైన వారికి తమ హాస్పిటల్‌లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ టీవీఎస్‌బీ రాజు మాట్లాడుతూ తమ బ్యాంక్ సిబ్బందితో పాటు ఖాతాదారులకు కూడా ఆరోగ్యంపై చైతన్యం తీసుకురావడానికి ఎంజే నాయుడు హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎస్. గౌతమ్, డాక్టర్ నందిగం నాగేశ్వర రావు వైద్య సేవలు అందించారు. ఎస్‌బీఐ అధికారులు పీ. వీరయ్య, వైవీ సత్యనారాయణ, పీ. వాసుదేవరావు, వీ. భారతి కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా





అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లాలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు, పాటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

– ఏలూరు మెట్రో

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	22	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	26	ములక్కాడలు	10-12
బెండకాయలు	48	కంద	40
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	34
కాకర కాయలు	30-36	కీరా దోస	40
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	60
బీరకాయలు (పందిరి)	60	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	40	చుక్కకూర	08
బంగాళదుంపలు	18	తోటకూర	08
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణీ	50
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	58
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	08
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	07
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	16
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	26
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	32
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు - తిరుపతి	16.00	4830	28

పన్ను చెల్లింపులకు ప్రత్యేక చర్యలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో పన్నుల చెల్లింపులకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. పన్నుల చెల్లింపులు ఉదయం 7.30గంటల నుంచి రాత్రి 8.30గంటల వరకూ రెవెన్యూ విభాగంలో నాలుగు కౌంటర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు, కుళాయి పన్నులు చెల్లించవచ్చని ఆయన తెలిపారు. సెలవు రోజుల్లోనూ పన్నులు కట్టించుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని నగర కమిషనర్ తెలిపారు. ఇప్పటికే నగరంలోని సచివాలయాల్లోని అడ్మిన్ సెక్రటరీలు ప్రజలకు పన్ను బకాయిల చెల్లింపులకు నోటీసులు జారీ చేశామనీ, పన్నులు చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

కూరగాయల హమాలీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు రూరల్: శనివారం ఏలూరు మార్కెట్ యార్డ్‌లో కూరగాయల హమాలీ కార్మిక సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించామని ఐఎఫ్‌టియూ రాష్ట్ర కార్యదర్శి యు వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇఫ్టూ నగర కమిటీ పరివేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ జరిగిందని వెల్లడించారు. మొత్తంగా 68 మంది కార్మికులు ఓటు వేయగా ప్రెసిడెంట్‌గా బాడితబోయిన వీరభద్రరావు, కార్యదర్శి రంగాల నూకరాజు, కోశాధికారి చోడే సూరితో పాటు మేస్త్రీలుగా కట్టా వెంకటేష్, చంద్రగిరి, బాలాజీ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. ఐఎఫ్‌టియూ జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావ్, నగర అధ్యక్షుడు కాకర్ల అప్పారావు, డి వీరనాయుడు, మంగం అప్పారావు, కోరాడ అప్పారావు, గడసాల తిరుపతిరావు, దన్నాన విజయ్, కాకర్ల శ్రీను, ఎస్ నెహ్రూబాబు, మీసాల రమణ తదితరులు పాలకవర్గం నిజాయితీగా పనిచేయాలని అభినందనలు తెలిపారు.

నేటి నుంచి వాసుదేవుని కల్యాణ మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పవర్‌పేట శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వాసుదేవస్వామి దేవస్థానంలో ఈ నెల 5వ తేదీ నుంచి స్వామివారి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు, అర్చకులు కందుకూరి వేంకట విజయ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి వారిని పెండ్లి కుమారుని, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేయనున్నామన్నారు. సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, దీక్షాధారణ, అఖండ దీపారాధన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, నిత్య హోమాలు, ధ్వజారోహణ, బలిహరణ పూజలు నిర్వహిస్తారన్నారు. 6వ తేదీన ఉదయం నిత్య హోమాలు, బలిహరణ, రాత్రి శ్రీవారి దివ్య కల్యాణ మహోత్సవం , తీర్థ ప్రసాద వితరణ చేస్తామన్నారు. 7వ తేదీన శ్రీ లక్ష్మీ జయంతి సందర్భంగా ఉదయం నిత్య హోమాలు, బలిహరణ, అనంతరం శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి విశేష మంగళద్రవ్యాలతో, సుగంధ ద్రవ్యాలతో, వివిధ పరిమళ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించి రాత్రి సువాసినీలచే సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. 8న ఉదయం, సాయంత్రం నిత్యహోమాలు, బలిహరణ, 9వ తేదీన ఉదయం కొట్నాలు, వసంతోత్సవం, పూర్ణాహుతి, రాత్రి 8 గంటల నుంచి స్వామి వారికి పవళింపు సేవ నిర్వహిస్తామన్నారు.